క్లుప్తంగా

తండ్రీకొడుకుపై దాడి

నెల్లూరు(క్రైమ్): పాత గొడవలను మనస్సులో పెట్టుకొని తండ్రీకొడుకుపై కొందరు దాడి చేసి గాయపర్చారు. పోలీసుల సమాచారం మేరకు.. రంగనాయకులపేటలోని ఉప్పరపాళెంలో నివాసం ఉంటున్న కుమార్ వైకుంఠయాత్ర లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. తన కుమారుడు మధురవీర్‌తో కలిసి సింహపురి బార్ వద్దకు బుధవారం వెళ్లారు. పాత గొడవలను మనస్సులో పెట్టుకొని నగరానికి చెందిన హజరత్‌నాయుడు తన స్నేహితులతో కలిసి మధురవీర్‌పై దాడి చేశారు. అడ్డుపోయిన కుమార్‌పై సైతం దాడికి పాల్పడ్డారు. ఘటనలో గాయపడిన మధురవీర్‌కు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- మాగుంట లేఅవుట్లోని ఓ ప్రైవేట్ కళాశాలలో లేక్‌వ్యూ కాలనీకి చెందిన దీపక్ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. క్లాస్‌రూమ్ బయట ఈ నెల మూడున పెద్దగా అరుస్తుండగా సహచర విద్యార్థి దాడి చేశారు. ఈ మేరకు దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు.

పిల్లల్లో వ్యక్తిగత పరిశుభ్రత ప్రధానం

కొడవలూరు : పిల్లలు ప్రధానంగా వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని ఆర్బీఎస్కే (రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం) జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎన్వీ.సుధీర్‌కుమార్ సూచించారు. మండలంలోని చంద్రశేఖరపురం ప్రాథమికోన్నత పాఠశాలలో పిల్లల్లో వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా వచ్చిన ఆయన మాట్లాడుతూ ఆరుబయట మల విసర్జన చేయరాదన్నారు. మల, మూత్ర విసర్జనల అనంతరం విధిగా చేతులను శుభ్రం చేసుకోవాలని చెప్పారు. రక్తంలో హిమోగ్లోబిన్ లోపిస్తే గుండె సంబంధిత సమస్యలు సంభవిస్తాయన్నారు. అందువల్ల హిమోగ్లోబిన్ తగ్గితే వెంటనే వైద్యశాఖ వారు ఇచ్చే ఐరన్ మాత్రలను ప్రతిరోజూ విధిగా వాడాలన్నారు. నులి పురుగుల మందులు సంవత్సరంలో రెండు సార్లు తప్పక వేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం డేగా మురళీమోహన్‌రావు, ఉపాధ్యాయులు శివకుమార్, పెంచలయ్య, భవాని, వైద్య సిబ్బంది టి.రాధమ్మ, కె.పద్మజ, ఎన్.కల్పన, బి.శీనమ్మ పాల్గొన్నారు.

అర్హులందరికీ పని దినాలు కల్పించాలి

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనిదినాలు కల్పించాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ పీడీ వెంకట్రావ్ అన్నారు. మండలంలోని పార్లపల్లిలో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న కాలువ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రతి కూలీని రోజుకు రెండుసార్లు నాలుగు గంటల వ్యవధిలో ఫొటోలు తీయాలని ఆదేశించారు. అలాగే ప్రతి కూలీకి రోజుకు రూ.237 గిట్టుబాటు అయ్యే విధంగా పని కల్పించాలని, ఇందుకు క్షేత్రస్థాయి సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం మండలంలో రబీ కింద వరిసాగు ముమ్మరంగా సాగుతున్న తరుణంగా చిన్నపాటి కాలువల పూడిక తీత పనులు చేపట్టాలని కోరారు. అనంతరం పలు మస్టర్లను తనిఖీ చేసి, కూలీలతో మాట్లాడారు. ఆయన వెంట ఈసీ సోఫియా, సిబ్బంది ఉన్నారు.

ఉగాదికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ముత్తుకూరు: ఉగాది నాటికి నిర్దేశించిన పక్కాగృహాల నిర్మాణం పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ సోమయ్య సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన జగనన్న లే అవుట్ల ఇన్‌చార్జిల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి కాలనీ ఇన్‌చార్జిని వారి సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. 1,046 ఇళ్లకు గానూ ఇప్పటివరకు 651 ఇళ్లు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన 402 ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని సూచించారు. అలాగే నిర్మాణం ప్రారంభం కాని ఇళ్ల పనులు వెంటనే మొదలుపెట్టేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పూర్తి చేసిన ఇళ్లకు బిల్లులు కూడా సకాలంలో చెల్లిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ మనోహర్‌బాబు, ఎంపీడీఓ ప్రత్యూష, ఎంఈఓ మధుసూదన్ పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించండి

ఇందుకూరుపేట: చిరుధాన్యాల సాగుపై మహిళా రైతులు దృష్టి సారించాలని డీటీసీడీ ఆర్‌సీ కోఆర్డినేటర్ సత్యవాణి సూచించారు. ఆత్మ, వ్యవసాయ సాంకేతిక సంస్థ, జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో 'జీ–20 మహిళల స్వావలంబన, అభివృద్ధి – సాధికారత'పై గురువారం శిక్షణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి 2023వ సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందని తెలిపారు. తొమ్మిది రకాల చిరుధాన్యాల పంటల ఉత్పత్తులను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చడానికి యంత్రాలు అంటుబాటులో ఉన్నాయని తెలిపారు. కేవీకే శాస్త్రవేత్త కిరణ్ రాగి, జొన్న, సజ్జల తదితర పంటల సాగుపై వివరించారు.

అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లను అడ్డుకోరా..?

- కార్పొరేషన్ అధికారులతో ఎంపీ ఆదాల సమీక్ష సమావేశం
- సమస్యలను రెండు వారాల్లో పరిష్కరించాలని ఆదేశాలు



మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమ లేవుట్లు, అక్రమ నిర్మాణాల విషయంలో టౌన్‌ప్లానింగ్ అధికారులపై ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేషన్ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశాన్ని కమిషనర్ హరిత ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రూరల్ పరిధిలో అక్రమ లేఅవుట్లు, అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నా, టౌన్‌ప్లానింగ్ అధికారులు ఏమి చేస్తున్నారని మండిపడ్డారు. అలాంటిదేమీలేదని టౌన్‌ప్లానింగ్ అధికారి దశయ్య సమాధానమిచ్చారు. తనతో వస్తే అక్రమ నిర్మాణాలను చూపుతానని ఎంపీ చెప్పారు. అక్రమ నిర్మాణాలపై రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పారిశుద్ధ్య, డ్రైనేజీ అంశాల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్పొరేషన్ పరిధిలోని పలు అంశాలను కార్పొరేటర్లు తెలియజేశారు. రెండు వారాల్లో సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని ఆదేశించారు. డివిజన్లలో అధికారులు పర్యటించిన సమయంలో కార్పొరేటర్లను సమన్వయపర్చుకొని సమస్యలపై దృష్టి సారించాలన్నారు.

విభాగాల హెడ్లకు సూచనలు

కార్పొరేషన్ విభాగంలోని హెల్త్, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, ఇంజినీరింగ్ విభాగాల్లోని ప్రతి అధికారితో ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. అధికారుల పనితీరును వివరిస్తూ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. చెడిపోయిన మాంసం కట్టడి అంశంలో ఎంహెచ్‌ఓ వెంకటరమణకు సూచనలిచ్చారు. ప్రతి 15 రోజులకోసారి మాంసం.. ఇతర ఆహార విక్రయ దుకాణాలపై దాడులు నిర్వహించాలని ఆదేశించారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ వెంకయ్య, కోటేశ్వరరెడ్డి, నరసింహారావు, ఏసునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మాభిమానం ఉంటే రాజీనామా చేయండి


మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌యాదవ్

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఆత్మాభిమానం, పౌరుషం ఉందని చెప్పుకొనే వారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున గెలుపొందారని, ఆ పదవుల్లో ఉండటం సరికాదని.. తక్షణమే రాజీనామా చేయాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ హితవు పలికారు. నగరంలోని ఆరో డివిజన్లో గల జీనిగలవారివీధి, సింగరాజువారి వీధి, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయాననే అంశాన్ని ఆరాతీసిన అనంతరం ఆయన మాట్లాడారు. 14 నెలల ముందే అధికారాన్ని వదులుకున్నానంటూ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్తున్నారని, మాటలకే పరిమితం కాకుండా ఎమ్మెల్యే పదవినీ వదలాలని సూచించారు. మేయర్, కొంత మంది కార్పొరేటర్లు పెద్ద మాటలు మాట్లాడారని పేర్కొన్నారు. నాయకుడిపై అభిమానం ఉండటం తప్పు లేదని, మీ నాయకుడి బలం, ధైర్యంతోనే గెలిచామనుకుంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుర్తు మీకెందుకని ప్రశ్నించారు. పదవులను వదలాలని సూచించారు. మరోసారి పోటీ చేసి గెలిచి వారి బలమేంటో నిరూపించుకోవాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పదవులను పట్టుకొని ఇంకా ఉండటం ఎందుకని నిలదీశారు. ఉప ఎన్నికల్లో ఏదైనా పార్టీ తరఫున లేదా స్వతంత్ర అభ్యర్థిగా గెలుస్తామనే నమ్మకం ఉందో లేదో తెలపాలని శ్రీధర్‌రెడ్డికి సూచించారు. కార్పొరేటర్ మస్తానమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న శారద

నెల్లూరు(మినీబైపాస్): జిల్లాలోని గ్రంథాలయాలను అభివృద్ధి చేసి.. పూర్వవైభవం తీసుకొచ్చేలా కృషి చేస్తున్నామని గంథాలయ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ శారద పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని ప్రధాన గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధి కోసం వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.ఆరు కోట్లు అవసరమని, ఈ మేరకు అంచనాలను సిద్ధం చేశామని వివరించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో దిన, వార, తదితర పత్రికల సరఫరా కోసం రూ.40 లక్షల బడ్జెట్ కేటాయింపు నిమిత్తం ప్రతిపాదనలను సిద్ధం చేశామన్నారు. గ్రంథాలయానికి నెల్లూరు నగరపాలక సంస్థ నుంచి రూ.27.69 కోట్లు, గ్రామ పంచాయతీల నుంచి రూ.3.29 కోట్లు సెస్ రూపంలో రావాల్సి ఉందన్నారు. స్వతంత్ర పార్కు వద్ద గల గ్రంథాలయాన్ని దాతలు, సిబ్బంది సహకారంతో ఆధునికీకరించామని పేర్కొన్నారు. వయోజన విద్యాశాఖ ఉప సంచాలకుడు రమేష్, సమాచార పౌర సంబంధాల జిల్లా అధికారి వెంకటేశ్వరప్రసాద్, భువనేశ్వరి, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా గుంజ ప్రతిష్ట



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల నిర్వహణకు సంబంధించిన గుంజ ప్రతిష్టను భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థాన ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి విలేకరులతో మాట్లాడారు. మార్చి రెండు నుంచి 13 వరకు బ్రహ్మోత్సవాలను విశేషంగా నిర్వహించనున్నామని వివరించారు.

సిబ్బందికి ఘన వీడ్కోలు



నెల్లూరు(క్రైమ్): నెల్లూరు సౌత్, నార్త్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న 24 మంది సిబ్బందికి ట్రాఫిక్ అధికారులు వీడ్కోలు పలికారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వీరిని నగర ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్, నార్త్, సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు నాగేశ్వరమ్మ, రమణారెడ్డి సత్కరించారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వర్తించి పోలీస్ శాఖ ప్రతిష్టను ఇనుమడింపజేయాలని డీఎస్పీ సూచించారు. ట్రాఫిక్ ఎస్సైలు రంగనాథ్‌గౌడ్, రహీమ్, ఆర్‌ఎస్సైలు తిరుమలరెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



నెల్లూరు(బృందావనం): యువజన సంగీత, నృత్య మహోత్సవాలను పురస్కరించుకొని ఆర్టీసీ సమీపంలోని ఎస్వీబీ ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాలలో గాత్ర కచేరి, నృత్య ప్రదర్శనలను గురువారం నిర్వహించారు. అనూష గాత్రానికి లోకేష్‌బాబు, పినాకపాణి వాద్య సహకారం అందించారు. అనంతరం అంజనీ డ్యాన్స్ అకాడమీకి చెందిన అంజనీకుమార్ శిష్య బృందం ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. ప్రిన్సిపల్ సాయిబాబా పర్యవేక్షించారు.

అన్ని రంగాల్లో ముందుండాలి


మాట్లాడుతున్న మహేంద్రరెడ్డి

నెల్లూరు(మినీబైపాస్): యువత అన్ని రంగాల్లో ముందుండాలని డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ మహేంద్రరెడ్డి పేర్కొన్నారు. యువతకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో గురువారం ఆయన మాట్లాడారు. సెట్నెల్ సీఈఓ పుల్లయ్య, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఉదయ్‌శంకర్, ప్రొఫెసర్ మణికంఠ, డాక్టర్ కణ్ణన్, జయప్రకాష్, ప్రొఫెసర్ నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నరేంద్రమోదీ జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రమోహన్ మాట్లాడారు. ప్రధాని మోదీ పిలుపుమేరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నామని వివరించారు. అధిక సంఖ్యలో 152 జట్లు పాల్గొనడం రాష్ట్రస్థాయి రికార్డు అని చెప్పారు. అనంతరం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యశ్వంత్‌సింగ్ మాట్లాడారు. ప్రతిభ చూపిన క్రీడాకారులకు రూ.82 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేయనున్నామని వివరించారు. రాష్ట్రస్థాయిలో పాల్గొనే జిల్లా జట్టును ఎంపిక చేయనున్నామని తెలిపారు. డీఎస్‌ఏ చీఫ్ కోచ్ యతిరాజ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రరెడ్డి, అధికార ప్రతినిధి ఆంజనేయరెడ్డి, జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్‌యాదవ్, ఆదిశంకర విద్యాసంస్థల అధినేత పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనిల్‌ను కలిసిన మంత్రి రాజా



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్‌ను నగరంలోని ఆయన నివాసంలో ఆర్ అండ్ బీ శాఖ మంత్రి దాడిశెట్టి రాజా గురువారం కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛాన్ని అందజేసి సత్కరించారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(క్రైమ్): దిశ పోలీస్‌స్టేషన్ ఎస్సైగా ఆనంద్ భాస్కర్‌బాబు బాధ్యతలను గురువారం స్వీకరించారు. సిబ్బందికి ఆయన పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్పీ విజయారావు, ఏఎస్పీలు హిమవతి, ప్రసాద్, నగర, దిశ డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, సురేష్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ మహిళా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

రాకెట్ ప్రయోగ విజయవంతాన్ని కాంక్షిస్తూ..





నెల్లూరు(బృందావనం): శ్రీహరికోట నుంచి చేపట్టనున్న ఎస్సెస్‌ఎల్వీ డీ – 2 రాకెట్ ప్రయోగ విజయవంతాన్ని కాంక్షిస్తూ భక్తవత్సలనగర్‌కు చెందిన కార్పెంటర్ శ్రీనివాసులు తన వృత్తి నైపుణ్యంతో ఎనిమిది అంగుళాల పరిమాణంలో మైనంతో రాకెట్ నమూనాను తీర్చిదిద్దారు.

- భక్తవత్సలనగర్‌కు చెందిన విద్యార్థిని పూజిత చాక్‌పీస్‌తో ఎస్సెస్‌ఎల్వీ డీ – 2 రాకెట్ నమూనాకు రూపమిచ్చారు.

పెద్దాస్పత్రికి ఫ్రిజ్ వితరణ



నెల్లూరు (అర్బన్): దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో గల జనరల్ మెడిసిన్ విభాగానికి ఫ్రిజ్‌ను గురువారం అందజేశారు. నర్సింగ్ సిబ్బంది ముందుకొచ్చి విరాళాలను సేకరించి ఫ్రిజ్‌ను సమకూర్చారు. ప్రారంభించిన అనంతరం హాస్పిటల్ సూపరింటెండెంట్ సిద్ధానాయక్ మాట్లాడారు. ఫ్రిజ్‌ను అందించడంపై నర్సింగ్ సిబ్బందిని అభినందించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మురళీకృష్ణ, ఆర్‌ఎంఓ కళారాణి, డాక్టర్ నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ కార్యాలయంలో డీఆర్వో తనిఖీలు



నెల్లూరు (అర్బన్): మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా కార్యాలయాన్ని డీఆర్వో, రెడ్‌క్రాస్ నెల్లూరు జిల్లా కమిటీ ప్రత్యేకాధికారి వెంకటనారాయణమ్మ తనిఖీ చేశారు. ప్రత్యేకాధికారిగా నియమితులైన అనంతరం తొలిసారిగా తనిఖీలు చేపట్టిన ఆమె రెడ్‌క్రాస్ అనుబంధంగా అమలవుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. బ్లడ్ బ్యాంక్, స్పాస్టిక్స్ సెంటర్‌ను పరిశీలించారు. నూతన పాలకవర్గాన్ని త్వరలో ఎన్నుకునేలా తగు చర్యలు చేపట్టాలని రెడ్‌క్రాస్ సెక్రటరీ మస్తానయ్యకు సూచించారు.

అనుచరులు నా వెంటే

నెల్లూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని తాను వీడినా అనుచరులు తన వెంటే ఉన్నారని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని గురువారం ఆయన నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో సంకష్టి చతుర్థి



నెల్లూరు(బృందావనం): సంకష్టి హరచతుర్థిని పురస్కరించుకొని ఆచారి వీధిలోని వరసిద్ధి విఘ్నేశ్వర స్వామి ఆలయంలో విఘ్నేశ్వరుడికి అభిషేకాలు, పూజలను భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. ప్రధానార్చకుడు శరవణమహేష్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. స్వామివారు విశేష పుష్పాలంకారంలో దర్శనమిచ్చారు.

క్రైమ్ కార్నర్

హత్య కేసులో నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): యువకుడి హత్య కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వెంగళరావునగర్‌కు చెందిన సురేష్, గాంధీనగర్‌కు చెందిన ఆరిఫ్ స్నేహితులు. అప్పుడప్పుడూ స్నేహితుడి ఇంటికి సురేష్ వెళ్లొచ్చేవారు. ఈ క్రమంలో వీరి మధ్య మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. తన ఇంటికి రావొద్దని ఆరిఫ్ సూచించారు. అయినా ఈ నెల మూడున స్నేహితుడి ఇంటికి సురేష్ వెళ్లారు. దీంతో ఆగ్రహానికి గురైన ఆరిఫ్ తన స్నేహితులైన చంద్రమౌళీనగర్‌కు చెందిన మహ్మద్ అలియాస్ యశ్వంత్, అజిత్‌కుమార్ అలియాస్ అజయ్‌కుమార్, బాబూజగ్జీవన్‌రామ్ కాలనీకి చెందిన నేహేమియాతో కలిసి సురేష్‌పై దాడి చేసి.. కులం పేరుతో దూషించి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన ఆయన్ను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో స్థానికులు చేర్పించారు. సురేష్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు నిందితులపై హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసులను తొలుత నమోదు చేశారు. సురేష్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో చికిత్స నిమిత్తం చెన్నైలోని ఓ హాస్పిటల్‌కు కుటుంబ సభ్యులు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. దీంతో హత్యాయత్నం కేసును హత్య కేసుగా పోలీసులు మార్చారు. విచారణ చేపట్టిన ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ శ్రీనివాసరావు నిందితులను అరెస్ట్ చేశారు.

హత్యాయత్నం కేసుల్లో..

నెల్లూరు(క్రైమ్): స్నేహితుడిపై హత్యాయత్నం చేసిన ఘటనలో ఇద్దరు నిందితులను వేదాయపాళెం పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వివరాలు.. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన రేవంత్ డిగ్రీ వరకు చదువుకొని ఖాళీగా ఉంటున్నారు. కొంత కాలం క్రితం గొడవ కేసులో రేవంత్‌తో పాటు పడారుపల్లికి చెందిన గిరీష్‌కుమార్, బీవీనగర్‌కు చెందిన నాగరాజును సంగం పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. రేవంత్ కారణంగానే జైలు కెళ్లామని వారు కక్ష పెంచుకున్నారు. కేసు రాజీ చేయించుకుందామంటూ రేవంత్‌కు ఈ నెల ఐదున ఫోన్ చేశారు. నెల్లూరు చేరుకున్న రేవంత్.. గిరీష్‌కుమార్, నాగరాజు మరో వ్యక్తి సాయితో కలిసి ఓ హోటల్లో మద్యం సేవించారు. అర్ధరాత్రి 12.30 ప్రాంతంలో పడారుపల్లిలోని ట్యాంక్ వద్దకు రేవంత్‌ను తీసుకొచ్చి బీర్ బాటిళ్లతో దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై రామారావు నిందితులపై హత్యాయత్నం కేసును నమోదు చేశారు. పడారుపల్లిలోని జాతీయ రహదారి వద్ద నిందితుల్లో గిరీష్‌కుమార్, నాగరాజును అరెస్ట్ చేశారు.

- మహిళపై హత్యాయత్నం చేసిన ఘటనలో నిందితుడ్ని వేదాయపాళెం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. వైఎస్సార్‌నగర్‌లో సుల్తానా తన పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నారు. నెల్లూరు క్లబ్‌లో గతంలో పనిచేసే సమయంలో ప్రసాద్‌తో పరిచయమైంది. ఆయన ఇబ్బందులకు గురిచేస్తుండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆయనకు కౌన్సెలింగ్ చేసి మందలించారు. ఈ క్రమంలో ఆమె ఇంటి వద్దకు ప్రసాద్ ఈ నెల నాలుగన వెళ్లి తనపైనే పోలీసులకు ఫిర్యాదు చేస్తావా అంటూ కత్తితో దాడి చేసి పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిపై హత్యాయత్నం కేసును పోలీసులు నమోదు చేశారు. రామకోటయ్యనగర్ వద్ద ప్రసాద్‌ను ఎస్సై వెంకటేశ్వర్లు అరెస్ట్ చేశారు.

మందుబాబుల వీరంగం

నెల్లూరు(క్రైమ్): బార్‌లో మందుబాబులు వీరంగం చేసిన ఘటనపై నవాబుపేట పోలీసులు కేసును గురువారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. రేబాలవారివీధిలోని ఎస్పీ బార్‌లో నగరానికి చెందిన జమీర్, షాకీర్ తన స్నేహితుడైన మరో వ్యక్తితో కలిసి మద్యాన్ని బుధవారం సేవించారు. స్నాక్స్ కావాలని వెయిటర్‌ను కోరగా, అయిపోయాయని చెప్పారు. దీంతో ఆగ్రహానికి గురైన వారు బార్‌లోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేయడంతో పాటు సిబ్బందిపై దాడి చేసి పరారయ్యారు. ఘటనపై బార్ క్యాషియర్ వెంకట్రావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యక్తిపై దాడి

నెల్లూరు(క్రైమ్): వ్యక్తిపై దాడి చేసిన నిందితుడిపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఏకేనగర్‌లోని పోలీస్ కాలనీకి చెందిన సాయికిరణ్ కరెంటాఫీస్ సెంటర్‌లోని ఓ బార్‌కు ఈ నెల ఐదున వెళ్లారు. అక్కడ మద్యం సేవిస్తుండగా పరిచయస్తుడైన సాయితేజ అలియాస్ బుల్లెట్ సాయి అతని మెడపై కొట్టి మద్యం ఇప్పించాలని కోరారు. కొట్టకుండా అడగొచ్చు కదా అని సాయికిరణ్ ప్రశ్నించారు. తననే ప్రశ్నిస్తావా అంటూ అతనిపై సాయి దాడి చేశారు. ఘటనపై పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు.

మహిళకు బెదిరింపులు

నెల్లూరు(క్రైమ్): ఓ మహిళ కుటుంబాన్ని చంపుతామని బెదిరిస్తున్న ఇద్దరిపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఇస్కాన్ సిటీలో ఓ మహిళ తన భర్త, కుమార్తెతో నివాసం ఉంటున్నారు. కేన్సర్‌తో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. దీంతో బంధువుల ద్వారా యూసఫ్‌గూడలో ఉంటున్న రామ్‌ప్రసాద్‌తో మహిళ కుటుంబానికి పరిచయమైంది. చెకప్‌కు వెళ్లిన సమయంలో వారు అతని ఇంట్లో ఉండేవారు. ఆర్నెల్ల క్రితం రామ్‌ప్రసాద్ మొదటి భార్య ఆమెకు ఫోన్ చేశారు. అతని గురించి చెప్పి సాయం చేయాలని కోరారు. విషయం తెలుసుకున్న రామ్‌ప్రసాద్ తన స్నేహితుడు సంతోష్‌తో కలిసి తన వ్యక్తిగత విషయాలు మీకెందుకంటూ వారం రోజులుగా మహిళ కుటుంబానికి ఫోన్ చేసి అసభ్యపదజాలంతో దూషించడంతో పాటు చంపుతామని బెదిరించసాగారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.